ఉష్ణోగ్రత: గరిష్ఠం 34.8 కనిష్ఠం 18.1





రేషన్‌షాప్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

బియ్యం పంపిణీలో జాగ్రత్తలు పాటించాలి

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేటలో రేషన్‌షాప్ పరిశీలన

శామీర్‌పేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం శామీర్‌పేటలోని (రేషన్ షాప్‌ను ఆయన సందర్శించారు. ఆయనతోపాటు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి(డీఎస్‌వో) సుగుణబాయి ఉన్నారు. పంపిణీ చేస్తున్న బియ్యం ఎలా ఉన్నాయని, డీలర్ సక్రమంగా ఇస్తున్నాడా? అనే విషయాలను వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు తీసుకుంటున్న సరుకుల వివరాలను సంబంధిత రిజిస్ట్రార్‌లో నమోదు చేస్తున్నారా? అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను, రశీదులను, తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఈ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుండగా కార్డు దారులు రేషన్ దుకాణాల వద్దకు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు. సన్న బియ్యం పంపిణీలో అత్యంత జాగ్రతగా వ్యవహరించాలని కలెక్టర్ డీలర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ సంయుక్త, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడంగల్: పిడుగుపాటుకు ఖాజాఅహ్మద్‌పల్లిలో మృతి చెందిన జీవాలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గురువారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నుంచి తెరపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో కుండపోతగా కురిసింది. తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు అకాల వర్షాలకు ఊరట చెందారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో 89.5 మి.మీ వర్షపాతం నమోదైంది. పలు చోట్ల గాలివానతో పాటు పిడుగులు బీభత్సాన్ని సృష్టించాయి. అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్ల పంటలు నీటమునిగాయి. రేపు, ఎల్లుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వికారాబాద్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

దంచికొట్టిన వాన

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- పిడుగుపాటుకు కొడంగల్‌లో 30 జీవాలు మృతి
- అత్యధికంగా సరూర్‌నగర్‌లో 89.5మి.మీ వర్షపాతం నమోదు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- మరో మూడు రోజుల పాటు భారీ వర్ష సూచన



పరిగి: చౌడాపూర్‌లో కురుస్తున్న వడగళ్ల వాన, ఇన్‌సెట్‌లో నేలకొరిగిన వరిపంట

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి రోడ్లపై వరద ఏరులై ప్రవహించింది. పిడుగుపాటుకు వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఖాజాఅహ్మద్‌పల్లిలో పకీరప్ప అనే రైతుకు చెందిన 13 మేకలు, 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం సింగాపూర్‌లో పిడుగుపాటు గేదె మృతి చెందగా రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. భారీ వర్షాలకు అనేక చోట్ల పంట నష్టం జరిగింది. కందుకూరు కొత్తవాడలో చామగడ్డ పంట నీట మునిగింది. అనేక చోట్ల కూరగాయపంటలకు నష్టం వాటిల్లింది. ఇంకా పలు చోట్ల అర్ధరాత్రి వరకు వర్షాలు కురుస్తూనే ఉండడంతో పంట నష్టం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటి అనేక చోట్ల ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న సమయంలో ఇప్పుడు కురుస్తున్న వర్షాలు ఊరట కలిగించాయి. ఇపుడు కురుస్తున్న వర్షాలకు భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు సంబరపడుతున్నారు. మూసీలో వరదనీరు పరవళ్లు తొక్కింది. ఇదిలా ఉంటే మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ సూచించింది. రంగారెడ్డి , మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది.



మహేశ్వరం: కొత్తవాడలో చామగడ్డ చేనులో వరదనీరు

వికారాబాద్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఫోన్ నంబర్ - 7995061192

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈదురుగాలులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జిల్లాలో పలుచోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్, తాండూరు, పరిగి ప్రాంతాల్లో సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉంటే, జిల్లాలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో వర్షాలతో ఏ సమస్య ఏర్పడినా 7995061192 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు.

దిస్ నంబర్ డస్‌నాట్ ఎగ్జిస్ట్...

ఇదిలా ఉంటే, వర్షాలు కురిసే ప్రాంతాల్లో సహాయక

మిగతా 7వ పేజీలో...



రంగారెడ్డి జిల్లా చౌదరిగూడలో కురుస్తున్న వర్షం

వర్షపాతం వివరాలు (మి.మీలలో)

రంగారెడ్డి జిల్లా:	
ఎల్‌బీనగర్	76.3
చంపాపేట్	72.3
ఇబ్రహీంపట్నం	51.3
కందుకూరు	46.5
మేడ్చల్ జిల్లా:	
బాలానగర్	77.5
అల్వాల్	72.5
ముసారాంబాగ్	67.0
రామంతాపూర్	55.5
ఉప్పల్	55.3
మల్కాజిగిరి	51.5
వికారాబాద్ జిల్లా:	
చౌడాపూర్	48.5
కుల్కచర్ల	46.0
కొడంగల్	35.5
ముజాహిద్‌పూర్	30.5
దౌల్తాబాద్	30.3
బషీరాబాద్	26.0
కాశీంపూర్	26.0
రాపోల్	22.5

సగటు పని దినాలు	60 రోజులు
కూలీల సగటు వేతనం	రూ.237.26
వేతన చెల్లింపుల వ్యయం	రూ.159.26 కోట్లు
మెటీరియల్ వ్యయం	రూ.102.96 కోట్లు

కూలీల వేతన వివరాలు

లక్ష్యానికి మించి ఉపాధి!

లక్ష్యం 66,37,236 పని దినాలు.. పని కల్పన 67,09,923 రోజులు



- రాష్ట్రంలో వికారాబాద్ జిల్లాకు అగ్రస్థానం
- వేతన, మెటీరియల్ చెల్లింపుల్లోనూ ముందంజ
- 10,911 కుటుంబాలకు 100 రోజుల పని

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో లక్ష్యాన్ని అధిగమించాయి. గత ఆర్థిక (2024-25) సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాలోని కూలీలకు 66,37,236 రోజులు పని కల్పించాలనే లక్ష్యం నిర్దేశించగా, మార్చి 31 వరకు 1,09,954 కుటుంబాలకు చెందిన 1,91,387 మంది కూలీలకు 67,09,923 రోజులు ఉపాధి కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 566 పంచాయతీల పరిధిలో 1,32,578 యాక్టివ్ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 2,45,421 మంది కూలీలు పనుల్లో చురుకుగా పాల్గొనే వారున్నారు. ఈ ఏడాది ఇంత వరకు వేతన రూపంలో రూ.159.26 కోట్లు ఖర్చు చేయగా, మెటీరియల్ వ్యయం కింద రూ.102.96 కోట్లు ఖర్చు చేశారు.

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు, వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా స్థానికంగానే వారికి పనులు కల్పించాలనేది ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా జాబ్ కార్డు పొందిన ప్రతి కుటుంబానికి ఉన్న చోటనే ఏడాదిలో వంద రోజుల పాటు పనులు కల్పించాలి. జిల్లాకు కేటాయించిన ఉపాధి పని రోజుల లక్ష్యం అధిగమించే దిశగా ప్రారంభం నుంచే

మిగతా 8వ పేజీలో...



ఉపాధి పనులను పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(ఫైల్)

జిల్లాలో ఉపాధి పనుల వివరాలు

పంచాయతీలు	566
యాక్టివ్ జాబ్ కార్డులు	1,32,578
పనిచేస్తున్న కూలీలు	2,45,421
ఉపాధి పొందిన కుటుంబాలు	1,09,954
ఉపాధి పొందిన కూలీలు	1,03,387
ప్రస్తుతం కూలీల హాజరు	35,262

పలు సూచికల్లో అగ్రస్థానం..

రాష్ట్రంలో ఎక్కువ కుటుంబాలకు వంద రోజుల పని కల్పించడంలో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంది. వంద రోజులకు సగటున 60 రోజుల్లో పనులు కల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. అంతే కాకుండా వేతన, మెటీరియల్ చెల్లింపుల్లోనూ జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో 159.26 కోట్లు వేతన చెల్లింపులు, రూ.102.96 కోట్ల మెటీరియల్ చెల్లింపులు చేసి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. కూలీలకు గత ఏడాది నిర్ణయించిన వేతనం రూ.300 కాగా, జిల్లాలో కూలీలు సగటు వేతనం రూ.237.36 తీసుకుని రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది.



పారదర్శకంగా

బియ్యం పంపిణీ

అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా జరగాలని, పంపిణీలో ఎలాంటి పొరబాట్లు జరగకూడదని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. ఆమె గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి చీర్యాల్‌లోని రేషన్ షాపును సందర్శించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన పోర్టిఫైడ్ సన్నబియ్యం పథకం అమలులో భాగంగా ఆమె బియ్యం పంపిణీ సరళి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం చీర్యాల్ ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయంటూ వివరాలు సేకరించారు. మొత్తం షాపులో ఎంత మొత్తంలో బియ్యం నిల్వ ఉన్నాయి? అని డీలర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అన్నం లేదు.. సిగరెట్ అమ్మం

- అన్నందుకు చెఫ్, హోటల్ యజమానిపై దాడి
- ఆపై అతని కూతురు, కొడుకును చితకబాదారు
- మేడ్చల్ పీఎస్ పరిధిలో ఘటన

7



వికారాబాద్ కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మేడ్చల్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలను విముక్తి చేసేందుకు వీరోచితమైన పోరాటం చేసిన వీరుడు దొడ్డి కొమురయ్య అని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతిని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సుధీర్, డీబీసీడీవో ఉపేందర్, డీఎస్సీడీవో మల్లేశం, డీటీడబ్ల్యూవో కమలాకర్ రెడ్డితో కలిసి హాజరై దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య సాధారణ గొర్రెల పెంపకందారుల కుటుంబంలో జన్మించినప్పటికీ దొరలు, భూస్వాముల అరాచకాలను తట్టుకోలేక యువతీ, యువకులను ఏకం చేసి వారి ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. వెట్టి చాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టుకొని విసునూరు దొరల ఆగడాలను అరికట్టించడంలో ముందు వరుసలో ఉండి పోరాటం చేశాడన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాముల తుపాకీ తూటాలకు బలైన తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఫరీనా ఖాతున్, ఏబీసీడీఓ బీమ్ రాజ్, ఏఎస్‌డబ్ల్యూఓ శుక్లవర్ధన్ రెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో..

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం దొడ్డి కొమురయ్య జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ అధికారి ఝన్సీరాణి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం



వెంకటేశ్వరస్వామికి చక్రస్నానం చేయిస్తున్న పురోహితులు

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు


కొడంగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పుష్కరిణి ఆవరణలో వరాహస్వామి మండపంలో శ్రీదేవిభూదేవి సమేతంగా ఉత్సవ మూర్తులకు సుగంధ ద్రవ్యాలతో పురోహితులు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజులపాటు స్వామివారు రోజుకో వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు

బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్



కొడంగల్/వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ పరిధిలో కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త బార్ అండ్ రెస్టారెంట్ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. 21 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, రూ.లక్ష(నాన్ రీఫండబుల్) చలాన్, ఆధార్, పాన్‌కార్డు, ఫొటోలతో వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3వ తేదీ నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని 29న కలెక్టర్ సమక్షంలో ఉదయం 11 గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : ఎస్పీ

పెద్దేముల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ హత్యకు గురైన ఘటనలో నిందితులను వీలైనంత త్వరగా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలో బుధవారం మహిళ హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాలను పరిశీలించారు. దర్యాప్తు పురోగతి గురించి డీఎస్పీ బాలకృష్ణారెడ్డిను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఈ కేసు విషయమై సమగ్ర విచారణ జరుపుతామని, ప్రాథమికంగా మృతురాలిని గుర్తించడంపై దృష్టి పెట్టామని తెలిపారు. దీనికోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. దర్యాప్తును వేగవంతం చేయాలని, క్లూస్‌టీం సహాయంతో శాస్త్రీయ ఆధారాలను సేకరించి అన్ని కోణాల్లో విచారణ చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎస్పీ వెంట తాండూరు రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, సిబ్బంది

జీతాలు చెల్లించాలని ఆందోళన


అలియాబాద్‌లో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

శామీర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలుగా జీతాలు లేక కుటుంబాలను పోషించలేకపోతున్నామని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీతాలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ పంచాయతీ కార్యాలయం ఎదుట 20 మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, జీతాలను చెల్లించకపోవడం దారుణమని వాపోయారు.

రైలు ఢీకొని 18 మేకలు మృత్యువాత



షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారులోని సోలీపూర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు ఢీకొని 18 మేకలు మృతి చెందాయి. గద్దం చంద్రయ్య తన మేకలను శుక్రవారం ఉదయం మేపడానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తోలుకువస్తున్న సమయంలో రైల్వే బ్రిడ్జి దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

అగ్నివీర్‌కు అన్నాదమ్ములు


సైనికులుగా ఎంపికైన యువకులను సన్మానిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

ధారూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తరిగోపుల గ్రామానికి చెందిన కుర్వశివ, విష్ణు అగ్నివీర్‌కు సైనికులుగా ఎంపికయ్యారు. వీరిని బీఆర్ఎస్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్, శ్యామలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డులు


అవార్డులు అందుకుంటున్న కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులు 85 శాతం వసూలు చేసినందుకుగాను తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ గురువారం రెండు ఉత్తమ అవార్డులను అందుకున్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో 2024-25 సంవత్సరానికిగాను 85 శాతానికి పైగా ఇంటి పన్నులు వసూలు చేసినందుకు బెస్ట్ అచీవర్ అవార్డును, అలాగే 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 85 శాతం ఆస్తి పన్నులు, మొత్తం 15.22 కోట్ల లక్ష్యానికి రూ.12.65 కోట్లు వసూలు చేసినందుకు బెస్ట్ కానిస్టెంట్ అచీవర్ అవార్డును అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సమావేశం సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి(ఐఏఎస్), (సీడీఎంఏ) తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌ను అభినందిస్తు రెండు ఉత్తమ అవార్డులను అందజేశారు.


దట్టీ ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అజ్మీర్‌కు బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రాజస్థాన్ రాష్ట్రంలోని హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా దర్శింకుని దట్టి సమర్పించుకోవటానికి బయలు దేరనున్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ మైనార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతులు మీదుగా దర్గాకు సమర్పించే దట్టీని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణం బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మైనార్టీ నాయకుడు మహబూబ్ అలీ, ఎండీ అబేద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి గురువారం మేడ్చల్ పట్టణంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం పంపిణీని పరిశీలించి పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. రేషన్ దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు.


సారా కేంద్రంపై దాడి చేస్తున్న రేంజర్ రాజేందర్, సిబ్బంది

నాటు సారా తయారీ కేంద్రంపై దాడి

ధారూరు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని సంగాయపల్లి తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రంపై రేంజర్ రాజేందర్, సిబ్బంది దాడి చేశారు. నాటుసారాకు వినియోగిస్తున్న వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించి వికారాబాద్ ఎక్సైజ్ అధికారులకు సమాచారమిచ్చారు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. అటవీ రేంజర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాలాల మండలం సంగాయపల్లి తండా సమీపంలో గస్తీ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వాగు నీటిలో నుంచి పారిపోతుండగా అనుమానం వచ్చి వెతికారు. అక్కడ నాటుసారా తయారీ స్థావరం కనిపించింది. పరిశీలించగా జీడి గింజలతో నాటుసారా తయారు చేస్తున్నట్లు ఆనవాళ్లు గుర్తించారు. నాటు సారా కోసం వినియోగించిన సర్వలు, ప్లాస్టిక్ బిందెలు, ప్లాస్టిక్ క్యాన్లు, ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తి నీలిగడ్డ తండావాసిగా అనుమానిస్తున్నామని రేంజర్ తెలిపారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి

అణచివేత ధోరణిలో కాంగ్రెస్ ప్రభుత్వం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. గురువారం మొయినాబాద్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో విద్యాసంస్థలకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్‌గాంధీకి హెచ్‌సీయూలో జరుగుతున్న అరాచకం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కొత్త నర్సింహ్మారెడ్డి, ముదిగొండ రవియాదవ్, మోర శ్రీనివాస్, రవుఫ్, జయవంత్, సుధాకర్ యాదవ్, కొత్త మానిక్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, షాబాద్ ప్రవీన్, పరమేష్ ఉన్నారు.

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరాన్ని విలీనం చేయాలి

- ఉద్యమానికి మండల ప్రజలందరూ సహకరించాలి
- 7న మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ
- జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి

మహేశ్వరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఫ్యూచర్‌సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేసే వరకు ఉద్యమం ఆగదని జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, ముఖ్య సలహాదారు కడారి జంగయ్య యాదవ్ హెచ్చరించారు. ఇందులో భాగంగా ఈనెల 7వ తేదీన మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం మహేశ్వరంలోని కర్నాటి కళాభవన్‌లో ఏర్పాటు చేసిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్ గ్రామాలను మాత్రమే ఫ్యూచర్‌సిటీలో విలీనం చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరికాదని, మిగితా గ్రామాలను కూడా కలపాలన్నారు. కార్యక్రమంలో కె.జంగయ్య యాదవ్, చంద్రయ్య, కాకి ఈశ్వర్, డి. యాదగిరెడ్డి, కె.జగన్‌రెడ్డి, ఎ.రాజునాయక్, బి.నర్సింహ్మాయాదవ్, అంద్యానాయక్, కందిరమేష్, వి. యాదయ్యగౌడ్, ఆంజనేయులు, దత్తునాయక్, సుభాష్, రాజునాయక్, పాండునాయక్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

(ఐదో పేజీ తరువాయి)

చర్యల కోసం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నంబర్ మొదట పనిచేసేది ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. సాయంత్రం కంట్రోల్ రూం నంబర్ 08416-242136కు కాల్ చేస్తే 'డస్ నాట్ ఎగ్జిస్ట్' అని రావడం గమనార్హం. రాత్రి 8.30 గంటల సమయంలో కాల్ చేయగా, దిస్ నంబర్ డస్‌నాట్ ఎగ్జిస్ట్.. ప్లీజ్ చెక్ ద నంబర్ యు ఆర్ డయల్డ్.. అని రికార్డు వాయిస్ వినిపించింది. అత్యవసర సేవల కోసం ప్రజల నుంచి వచ్చే అభ్యర్థనలపై హుటాహుటిన స్పందించేందుకు పనిచేసే ఫోన్ ఏర్పాటు చేయాల్సిన జిల్లా యంత్రాంగం పనిచేయని ఫోన్ నంబర్ ప్రకటించడం గమనార్హం. ఈ విషయమై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తం కావడంతో రాత్రి హుటాహుటిన కంట్రోల్ రూం నంబర్ మార్చి ప్రకటించారు. భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొనే వారు 7995061192కు కాల్ చేయాలని అధికారులు ప్రకటించారు.

మేడ్చల్ జిల్లాలో పొంగిపొర్లిన నాలాలు..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో గురువారం సాయంత్రం శామీర్‌పేట, ఘట్‌కేసర్, కీసర మండలాలతో పాటు జీహెచ్ఎంసీ ప్రాంతాల్లోని అల్వాల్, కొంపల్లి, తిరుమలగిరి, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.


చేవెళ్లలో కురుస్తున్న వర్షం

వృద్ధుడి దారుణ హత్య

మోమిన్‌పేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధుడిని హత్య చేశారు. ఎస్ఐ అరవింద్, సీఐ వెంకట్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కతల గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(72) రెండు కాళ్లు చచ్చుబడిపోయి ఇంట్లో ఉంటున్నాడు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు తలారి బస్వరాజ్, నర్సింగ్‌రావు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. గ్రామంలో ఒంటరిగా ఉంటున్న కిష్టయ్యను గ్రామానికి చెందిన జంగిలి మల్లేశం చూసుకుంటున్నాడు. బుధవారం రాత్రి తలారి కిష్టయ్యకు మల్లేశం అన్నం పెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం తలారి కిష్టయ్యను అటుగా వెళ్తున్న పాయగాళ్ల అంతయ్య పిలిచినా పలకలేదు. దీంతో జంగిలి మల్లేశం, పాయగాళ్ల అంతయ్య ఇద్దరు కలిసి ఇంట్లోకి వెళ్లి చూడగా తల వెనుక భాగంలో గాయాలు కనిపించాయి. స్థానికుల సమాచారం మేరకు కుమారుడు బస్వరాజ్ గ్రామానికి చేరుకొని తండ్రి మృతదేహాన్ని పరిశీలించాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన తండ్రిని ఏదో కారణంతో హత్య చేసి ఉంటారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్ఐ అరవింద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఐ వెంకట్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పూడూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం పూడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులకు రెండో పీఆర్సీ వర్తింపజేయడంతోపాటు రూ.18వేల కనీస వేతనం అందజేయాలని, రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 19 తర్వాత సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని తెలిపారు. అనంతరం ఎంపీవో సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంగయ్య, నర్సింహులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అన్నం లేదు.. సిగరెట్ అమ్మం


మాట్లాడుతున్న బాధితులు

అన్నందుకు చెఫ్, హోటల్ యజమానిపై దాడి

ఆపై అతని కూతురు, కొడుకును చితకబాదారు.. మేడ్చల్ పీఎస్ పరిధిలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిగరెట్, భోజనం కావాలంటూ ఓ యువకుడు హోటల్‌లో చొరబడి వీరంగం సృష్టించాడు. అన్నం లేదని, సిగరెట్లు అమ్మమని చెప్పినా వినకుండా వంటమనిషిని చితకబాదాడు. విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న హోటల్ యజమాని అతడితోపాటు వచ్చిన కూతురు, కొడుకుని విచక్షణారహితంగా బండ రాళ్లతో దాడి చేసి తీవ్ర గాయాల పాలు చేశాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో జరిగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 30న ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో దుర్గాప్రసాద్ (లడ్డు) మండలంలోని సోమారం గ్రామ సమీపంలో రాజేష్ హోటల్ వద్దకు వచ్చాడు. అప్పటికే హోటల్ షట్టర్ వేసి ఉండటంతో బలవంతంగా షట్టర్ లేపి లోపలికి ప్రవేశించి అన్నం పెట్టాలని, సిగరెట్ కావాలని అడిగాడు. వంట మనిషి దివాకర్ సిగరెట్లు అమ్మమని చెప్పడంతో అతడిపై దాడి చేశాడు. దివాకర్ హోటల్ యజమాని రాజేష్‌కు సమాచారం ఇవ్వటంతో అతడు రాత్రి తన కూతురు శివాని, కొడుకు కృష్ణతో కలిసి హోటల్ వద్దకు చేరుకుని దుర్గాప్రసాద్(లడ్డు)ను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. అతను సమీపంలోని బండ మైలారం గ్రామానికి వెళ్లి 20 మంది యువకులను తీసుకొచ్చి హోటల్‌పై దాడి చేశాడు. యజమాని రాజేష్, అతని కొడుకు కృష్ణ, వంటమనిషి దివాకర్‌లను చితకబాదుతుండటంతో సముదాయిచడానికి ప్రయత్నించిన శివానిని విచక్షణారహితంగా బండరాయితో తలపై బాదాడు. దీంతో రక్తపు మడుగుల్లో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెపై పిడి గుద్దులతో దాడి చేశారు. బాధితులు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం పోలీసులు మేడ్చల్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దుర్గా ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. .

కేసు పెట్టారు.. వదిలేశారు

పోలీసులు దుర్గా ప్రసాద్‌పై కేసు పెట్టి స్టేషన్ బెయిల్ ఇచ్చి వదిలేయటంపై బాధితులు మండి పడ్డారు. బాధితురాలు శివాని మాట్లాడుతూ.. యువతి అన్న కనికరం లేకుండా ఓ ఉన్మాదిలా ప్రవర్తించిన యువకునిపై నామమాత్రపు కేసు పెట్టి స్టేషన్ బేయిల్ ఇచ్చి వదిలేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించింది. దాడిలో దుర్గా ప్రసాద్‌తోపాటు బండమైలారం గ్రామానికి చెందిన మరో 20 మంది యువకులు ఉన్నారని తెలిపింది. పూర్తి స్థాయిలో విచారణ జరపకుండా కేవలం ఒక వ్యక్తిపై కేసు పెట్టి పోలీసులు చేతులు దులుపుకున్నారని ఆరోపించింది. తనపై దాడికి పూనుకున్న వారందరిపై పోలీసులు కేసు పెట్టాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. మనవత్వం మరిచిన వారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేసింది.

బీజాపూర్ రోడ్డు విస్తరణపై సీఎం స్పందించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హైవేపై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. రోడ్డు విస్తరణలో మర్రి చెట్లు తొలగించొద్దని కోర్టుల్లో కేసులు ఉన్నాయని, అందుకే పనులు చేయలేకపోతున్నామని డొంకతిరుగుడు సమాధానం చెప్పడం సరికాదన్నారు. హెచ్‌సీయూలో ఉన్న వేలాది చెట్లను రాత్రికిరాత్రే ఎలా తొలగిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా హైవే విస్తరణపై సీఎం రేవంత్ నోరువిప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, ప్రభాకర్, కర్నె శివప్రసాద్, దేశమోళ్ల ఆంజనేయులు, వంగ శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోనే కరుణాకర్‌రెడ్డి, చందు, నర్సింలు, ఎల్లయ్య, మల్లేష్, వెంకటేశ్, తోట చంద్రశేఖర్ ఉన్నారు.


ఆరుట్లలో ఎండిన వరిచేలను పరిశీలిస్తున్న భాస్కర్, తదితరులు

మంచాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- మాదిగ జేఏసీ నియోజకవర్గ చైర్మన్ భాస్కర్

మంచాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ఈ ప్రాంతంలో అధిక శాతం వరి పంటలు నీరు అందక ఎండిపోయాయని మాదిగ జేఏసీ నియోజకవర్గ చైర్మన్ కంబాలపల్లి భాస్కర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో పర్యటించి ఎండిన వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఈ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి కరువు నెలకొందని పేర్కొన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో వేసిన కొద్దిపాటి పంటలు కూడా ఎండిపోతున్నాయని వాపోయారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. శివన్నగూడ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి ఎత్తిపోతల ద్వారా మంచాల మండలానికి తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నరేందర్‌గౌడ్, మంద నారాయణరెడ్డి, చెరుకు ఐలయ్య, మల్లారెడ్డి, పున్నంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, కొండిగారి ప్రవీణ్, జోగు ప్రహ్లాద్, మంకు వంశీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది ఇజ్రాయేలు మరణం తీరనిలోటు

మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దళిత సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది ఇజ్రాయేలు మరణం తీరని లోటని, అతడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయేలు దశదిన కర్మ గురువారం తుమ్మలూరు కాకి ఈశ్వర్ ఫంక్షన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి వేర్వేరుగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్యలకు పాల్పడుతున్న నిందితులకు కఠిన శిక్షలు వేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని కోరారు. ఇజ్రాయేలు ఎప్పుడూ పేద వర్గాలకోసం ఎనలేని పోరాటం చేసేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, జంగయ్యయాదవ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, రఘుపతి, నర్సింహయాదవ్, రమేష్, చంద్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, జంగయ్య, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవాది ఇజ్రాయేలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

ఆడుకోవడానికి హన్మకొండ వెళ్లా..

- 24 గంటల్లో బాలిక ఆచూకీ కనుగొన్న పోలీసులు



అదృశ్యమైన బాలికను తల్లికి అప్పగిస్తున్న సీఐ పరశురాం, ఎస్ఐ నర్సింహ, సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలిక ధనశ్రీ కథ సుఖాంతమైంది. బుధవారం అదృశ్యమైన బాలిక కేసును ఘట్‌కేసర్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం గుంజ రాజశేఖర్, సరస్వతీ కూతురు గుంజ ధనశ్రీ(9) తప్పిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారాలను సేకరించి హన్మకొండలో ఆచూకీ కనుగొని బాలికను ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికను విచారించగా ఆడుకోవడానికి పిల్లలు ఎవరు లేకపోవడంతో హన్మకొండ పట్టణానికి వెళ్లినట్లు తెలిపింది. ఘట్‌కేసర్‌లో బస్సు ఎక్కి ఆధార్‌కార్డు చూపించి హన్మకొండకు చేరుకుంది. చదువుకోవాలని ఉందని ధనశ్రీకి చెప్పడంతో సీఐ సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్ కమిటీ)కి సమాచారం అందించారు. బాలిక చదువు కోసం అల్వాల్‌లోని సఖి సెంటర్‌కు అప్పగించారు. బాలికను ఆచూకీ లభించడానికి కృషిచేసిన రాచకొండ ఐటీసెల్ సిబ్బందికి, పోలీసులకు సీఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


చేవెళ్ల: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హెచ్‌సీయూ భూముల ఆక్రమణను నిలిపివేయాలి

- బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చేవెళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల ఆక్రమణను నిలిపివేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ 400 ఎకరాలు వేల వృక్షాలు, జంతువులు, పక్షులు, కీటకాలకు అవాసంగా ఉందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వమే రాత్రికి రాత్రే ఆక్రమణకు పాల్పడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, మచ్చేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.


వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కార్పొరేట్ శక్తులకు అమ్మే కుట్ర

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్ వ్యవస్థకు అమ్మేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు వివేకానందారెడ్డి, చరణ్ రెడ్డి, సాయి ఉన్నారు.

అర్ధరాత్రి అరెస్టులు


తెల్లవారుజామున అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూలో కొనసాగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఛలో సెక్రటేరియట్, ఉమెన్ జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశానికి పిలుపు ఇవ్వడంతో ప్రజా సంఘాల నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో వికారాబాద్ పట్టణంలోని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మహేందర్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సుప్రీం కోర్టు స్టే హర్షణీయం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం హర్షించదగ్గ పరిణామమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని, హైడ్రా విషయంలోనూ హైకోర్టు ఎన్నోసార్లు తెలంగాణ ప్రభుత్వాన్ని తప్పు పట్టిందన్నారు. హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేతను తక్షణమే ఆపాలని, సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఇది హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రొఫెసర్లు, పర్యావరణ ప్రేమికుల విజయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రభుత్వ భూముల అమ్మకాలను ఆపివేయాలని పేర్కొన్నారు.


పరిగిలో..


ఘట్‌కేసర్: చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం


కీసరలో వర్షం


పెద్దేముల్: ఇందూరులో వర్షానికి తడిసిపోయిన ఉల్లిపంట

ఎడతెరిపిలేని వర్షం

● ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ● పలు చోట్ల పంట నష్టం


వికారాబాద్: పట్టణంలోని ఎన్నెపల్లి సమీపంలో..


కీసర రూరల్: నాగారంలో వర్షంలోనూ ప్రయాణిస్తున్న వాహనదారులు


బొంరాస్‌పేట్: మదన్‌పల్లిలో..


దోమ: మండలంలో ఎడతెరిపిలేని వర్షం

వికారాబాద్-మేడ్చల్ జిల్లాలో గత కొన్ని రోజులుగా భగభగ భానుడి ప్రతాపంతో వాతావరణం వేడెక్కగా గురువారం కురిసిన వర్షంతో ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దాదాపు ఆరు గంటల పాటు కురిసింది. విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొడంగల్ పరిధిలో పిడుగు పాటుతో మేకలు, గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఎండ తీవ్రత కారణంగా బోరుబావుల్లో నీరు అడుగంటిపోతున్న తరుణంలో ఈ వర్షం రైతులకు కాస్త ఊరటనిచ్చింది. పలు చోట్ల వరి పంట పొలాలకు నష్టం వాటిల్లింది. పెద్దేముల్‌లోని ఇందూరులో మూడెకరాల్లో ఉల్లి పంట తడిసిపోయింది. తాండూరు మండలంలోని బెల్కటూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి నాలుగు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**


మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలో..


ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారంలో..


కొడంగల్‌లో..

క్రైం కార్నర్

ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో చోరీ

● 10 తులాల వెండి, పూజా సామగ్రి అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. మరో రెండిళ్లలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్, సీ1 కాలనీలోని మన్మోహన్ ఇంటి తాళాన్ని పగులగొట్టి ఉండటంతో ఉదయం గమనించిన స్థానికులు మన్మోహన్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటిలోపలికి వెళ్లిచూడగా పూజ గదిలోని 10తులాల వెండి పూజాసామగ్రి కనిపించలేదు. దీంతో విషయం తెలుసుకున్న క్రైం సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు ఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మన్మోహన్ తల్లిదండ్రులు గతనెల అమెరికాకు వెళ్లగా, అతడు నగరంలోని అప్పా జంక్షన్ వద్ద ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నట్లు తెలిపారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మరో రెండిళ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున మద్దిమడుగు నుంచి మహంతీపూర్‌కు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ట్రాక్టర్ యజమాని సంతోష్, టిప్పర్ యజమాని పాత్లావత్ రవినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యానికి మించి ఉపాధి!

(ఐదో పేజీ తరువాయి)

అధికారుల పర్యవేక్షణ కొనసాగుతూ వచ్చింది. వ్యవసాయం, వ్యవసాయేతర పనులు తక్కువగా ఉండే వేసవి సీజన్‌లో కూలీలు ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యేలా ప్రోత్సహించారు.

ఉష్ణోగ్రతలు పెరిగినా..

గతేడాది మార్చి నెలలో ఉపాధి పనులకు 40 వేల మందికి పైగా కూలీలు హాజరు కాగా, ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ఉపాధి కూలీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య 40 వేలకు పైగానే పెరగడం వల్ల ఉపాధి హామీ పనుల రోజుల లక్ష్యాన్ని అధిగమించారు. జిల్లాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులకు 40 వేల మందికి పైగా కూలీలు హాజరవుతుండగా, జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 10,911 కుటుంబాలకు వంద రోజుల చొప్పున పని కల్పించారు. అలాగే కూలీలు రూ.237.26 సరాసరి వేతనం పొందుతున్నారు. ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఉపాధి పనులకు హాజరయ్యేందుకు కూలీలు వెనకంజ వేసినా జిల్లాకు కేటాయించిన పని రోజుల లక్ష్యాన్ని అధిగమించగలిగారు.

పలు రకాల అభివృద్ధి పనులు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఫాంపాండ్స్, ఫీల్డ్ ఛానెల్స్, చెరువుల పునరుద్ధరణ, పంట పొలాలకు రహదారులు, పశువులు, మేకల పాకలు, కోళ్ల ఫాంలు, చెక్‌డ్యాంలు, నీటి సంరక్షణ పనులు, ఇంకుడు గుంతలు, బోరు బావుల రీఛార్జి, నాడెప్ కంపోస్ట్ పిట్స్, నర్సరీల పెంపకం, మొక్కలు నాటడం, మొక్కల సంరక్షణ పనుల, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు తదితర పనులు చేపడుతున్నారు.

సమష్టి కృషితోనే సాధ్యమైంది



జిల్లా ఉపాధి హామీ పనుల్లో మంచి ప్రగతి కనబరిచింది. అందరి కృషితోనే పని రోజుల లక్ష్యాన్ని అధిగమించగలిగాం. ఎంపీడీవోలు, ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర గ్రామీణాభివృద్ధి సిబ్బంది కూలీలు ఈజీఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ఎవరి స్థాయిలో వారు ప్రోత్సహించారు. పలు సూచికల్లో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచేందుకు కృషి చేసిన, సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగించాలని కోరుకుంటున్నా.

- శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, వికారాబాద్

దేశంలో ఎక్కడాలేని పథకాల అమలు


తాండూరు రూరల్: చెన్‌గేష్‌పూర్‌లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్ కాలనీ, పాత తాండూర్‌తోపాటు తాండూర్ మండలంలోని చెన్‌గేష్‌పూర్ గ్రామంలో గురువారం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, తహసీల్దార్ తారాసింగ్, నాయకులు అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

తాండూరు: నియోజకవర్గంలో 2,31,260 మందికి సన్న బియ్యం లబ్ధిపొందుతున్నారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తాండూరులో రాజీవ్ గృహ కల్ప ఇందిరమ్మ కాలనీలో 17వ వార్డులో సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, తహసీల్దార్ ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: పెద్దేముల్, జనగాం గ్రామాల్లో గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, గోపాల్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం అందించడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన చేతులమీదుగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ధారాసింగ్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: అందరికి కడుపునిండా అన్నం పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని బార్వాద్‌లోని రేషన్ దుకాణం 01లో గురువారం ఆయన చేతులమీదుగా రేషన్‌బియ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, రవికుమార్, సంజీవయ్యగౌడ్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

పరిగి: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పరిగితో పాటు, మాదారం గ్రామంలో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, బి.పరశురాంరెడ్డి, సిద్దాంతిపార్థసారథి, కె.హన్మంత్‌ముదిరాజ్, ఇ.కృష్ణ పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని కన్మాన్ కాల్వలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గురువారం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పూడూరు: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డీసీఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు.

దోమ: మండలంలోని బొంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బొంరాస్‌పేట్: బాపల్లి తండాలోని రేషన్ దుకాణంలో మాజీ సర్పంచ్ మోత్యానాయక్ గురువారం సన్న బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధర్మేంద్రసింగ్, మహేందర్‌సింగ్, రతననాయక్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని టేకుల్‌కోడ్, అంగడి రైచూర్, సంగాయిపల్లి, చిట్లపల్లి గ్రామాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి రేషన్ దుకాణాల్లో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటకం శివకుమార్‌గుప్త పాల్గొన్నారు.

దుద్యాల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు పుర్ర వెంకటయ్యయాదవ్ అన్నారు. మండలంలోని పోలెపల్లి గ్రామంలో గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి ఆలయ చైర్మన్ జయరాములు, ఆర్.రాములు, జి.చంద్రయ్య పాల్గొన్నారు.


పరిగి: మాదారం సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దౌల్తాబాద్: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోటంరాములు గురువారం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు.

నవాబుపేట: మండల కేంద్రంలో రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీని చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మందికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

తాండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట తొలి అమరుడు స్వర్గీయ దొడ్డి కొమురయ్య జయంతిని తాండూరులో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని యశోదనగర్ పార్కు వద్ద గురువారం కొమురయ్య విగ్రహం వద్ద తాండూరు డివిజన్ కుమరు సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్న, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజు గౌడ్, మాజీ జడ్పీటీసీ గౌడి మంజుల, బీజేపీ నియోజకవర్గ నాయకులు యు.రమేష్, కురుమ సంఘం డివిజన్ ప్రతినిధులు పూజారి పాండు, జగదీశ్వర్, నర్సింహులు, బొప్పి సురేష్, న్యాయవాది గోపాల్, రుక్మాపూర్ రమేష్, గౌడి వెంకటేశం, తదితరులు ఉన్నారు.

పరిగి: మహనీయుల ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కురుమ సంఘం జిల్లా సలహాదారుడు టీవీ నర్సింహులు, ఉపాధ్యక్షుడు వార్ల ఆంజనేయులు, పరిగి మండల అధ్యక్షుడు కె.నర్సింహులు అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా గురువారం పరిగిలోని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు పి.నర్సింహులు, ఆర్.మల్లేశ్, కె.లక్ష్మణ్, ఆర్.నర్సింహులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కురువ సంఘం నాయకులు గురువారం ఆయన 98వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.నాగప్ప, దస్తప్ప, మధు, పరమేశ్, నర్మద కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పోచారం మున్సిపాలిటీ కురుమ సంఘం నాయకులు గొంగళ్ల బాలేష్, గొంగళ్ల మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహంను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, అచ్చిని రమేష్, అచ్చిని నర్సింహ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో ఫాంహౌస్‌కు సీసీరోడ్డా?

తాండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.60లక్షలు ఓ ప్రైవేటు వ్యక్తి ఫాంహౌస్‌కు రోడ్డు వేయడాన్ని బీజేపీ నాయకులు తప్పుపట్టారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో గురువారం మాజీ కౌన్సిలర్ బాలప్ప, నాయకులు బంటారం భద్రేశ్వర్, దొమ కృష్ణలు సిసి రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు ప్రజలకు అవసరం కాకుండా ప్రైవేటు వ్యక్తికి ఫాంహౌస్‌కు వెళ్లేందుకు వేయడం సిగ్గుచేటని వారు ఆరోపించారు. పట్టణ శివారు కోకట్ గ్రామ శివారు నుంచి పాత కుంట సమీపంలోనున్న ఒక అధికార పార్టీ నాయకుడి ఫాంహౌస్ వరకు ఈ రోడ్డును వేశారు. ఉపయోగం లేని ప్రదేశంలో రోడ్డు వేసి కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని, కలెక్టర్, ఎంపీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ నిధులను కక్కించే వరకు పోరాటం చేస్తామని అన్నారు.


ప్రైవేట్ ఫామ్‌హౌస్‌కు వేసిన సీసీరోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు నాగారం మల్లేశం, బాలప్ప, భద్రేశ్వర్

హెచ్‌సీయూ భూములను రక్షించాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూములను సంరక్షించి విద్యార్థుల అవసరాల కోసం ఉపయోగపడేవిధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సబిత డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీకే కాలనీలో హెచ్‌సీయూ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, సునీత, అనసూయ, భారతమ్మ, పార్వతమ్మ, లలిత, సరళ, స్రవంతి పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన విజిలెన్స్ అధికారి

బషీరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గొట్టిగకలాన్ అటవీ ప్రాంతాన్ని విజిలెన్స్ అధికారి ముకుంద్‌రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. అటవీ ప్రాంతంలోంచి జరుగుతున్న రోడ్డు పనులకు ఇటీవల ఓ కాంట్రాక్టర్ మొరం తవ్వకాలు చేపట్టడంపై ఆయన ఆరా తీసినట్లు సమాచారం. మొరం తవ్వకాలు ఎక్కడెక్కడా జరిగాయనే దానిపై ఫారెస్ట్ రేంజర్ సరస్వతి శ్రీదేవిని అడిగి స్వయంగా పరిశీలించి వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆ శాఖ అధికారి ఒకరూ ధ్రువీకరించారు.

లింగ సమానత్వం దిశగా తెలంగాణ

● ఐరాస మానవ హక్కుల మండలిలో ప్రస్తావన

తాండూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లింగ సమానత్వం దిశగా తెలంగాణ ముందుకెళ్తున్నట్లు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ ట్రూప్స్‌గా నియమించిన విషయాన్ని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలిలో ప్రస్తావించారు. ఈ విషయాన్ని తాండూరు ప్రాంతానికి చెందిన మెట్టు సాయి సంపత్ గురువారం వివరాలను వెల్లడించారు. జెనివాలో జరుగుతున్న 58వ ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) సమావేశాల్లో పాల్గొన్న సంపత్ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అక్కడ వెల్లడించారు. లిఖిత పూర్వకంగా ఈ అంశాలకు సంబంధించి యూఎన్‌హెచ్‌ఆర్‌సీకి నివేదిక రూపంలో సమర్పించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఐరాస వేదికపై ప్రసంశించారని చెప్పారు.



ఐరాస వేదికపై చర్చిస్తున్న సాయి సంపత్

ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్


కొడంగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'రాజీవ్ యువ వికాస్' ఆఫ్‌లైన్ దరఖాస్తులకు కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో శ్రీనివాస్ గురువారం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. ఈనెల 14 వరకు ప్రభుత్వం విడుదల చేసిన దరఖాస్తు ఫారంకు కావాల్సిన సర్టిఫికెట్లు జతచేసి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, ఏపీయం వెంకన్న, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

బషీరాబాద్: నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపట్టిన రాజీవ్ యు వికాస్ పథకానికి ఈ నెల 14 వరకు గడువు పొడిగించినట్లు బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం

కులకచర్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. ముజాహిద్‌పూర్‌లో గురువారం ఉపాధిహామీ నిధులు రూ.7 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, స్థానికులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఆంజనేయులు

సంక్షిప్తంగా..

ప్రశాంత వాతావరణంలో శ్రీరామనవమి జరపాలి

ఘట్‌కేసర్ రూరల్: ఈనెల 6న జరుగబోయే శ్రీరామనవమి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరశురాం తెలిపారు. పోలీసుస్టేషన్‌లో గురువారం ఆలయ నిర్వాహకులతో శాంతి సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్: కొత్తగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కార్యాచరణ రూపొందించాలి

తాండూరు: గ్రామ గ్రామాన జై బాపు, జై భీమ్ , జై సంవిధాన్ ప్రోగ్రాం నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలని ప్రోగ్రాం కో ఇన్‌చార్జి రాజీవ్‌రెడ్డి అన్నారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

తాండూరు: తాండూరు సింధూ డిగ్రీ కళాశాలలో గురువారం వీడ్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

తాండూర్ పశువైద్యాధికారిగా నోహ

తాండూర్ రూరల్: తాండూర్ పశువైద్యాధికారిగా నోహ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ హైదరాబాద్ పశువైద్య జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నోహ తాండూర్‌కు బదిలీఅయ్యారు.

మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంస

కొడంగల్: మున్సిపల్ పరిధిలో పూర్తిస్థాయిలో పన్నుల వసూలు చేపట్టడంతో సేవలకు గుర్తింపుగా గురువారం హైదరాబాద్‌లో ఐఏఎస్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ శ్రీదేవి చేతుల మీదుగా ప్రశాంస పత్రం అందుకున్నాడు.

ఆలయాలకు ప్రత్యేక ఎండోమెంట్ ఏర్పాటు చేయాలి

పెద్దేముల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలు, బంజారాల ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం వేయికోట్ల రూపాయలతో ప్రత్యేక ఎండోమెంట్‌ను ఏర్పాటు చేయాలని యాడీబాపుగడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రం, జాగోబంజారా వ్యవస్థాపకులు రమావత్ సురేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన రమావత్ సురేందర్‌నాయక్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే భారత్ బంజారా ధర్మస్థాపన సభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు.

కాలనీ మీదుగా బస్సులు నడపాలి

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణం నుంచి శామీర్ పేట వైపు నడిచే ఆర్టీసీ బస్సులను కేఎల్‌ఆర్, రాఘవేంద్రనగర్, బాలాజీనగర్ మీదుగా నడపాలని కోరుతూ కాలనీ వాసులు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. పట్టణం నుంచి శామీర్‌పేటకు వెళ్లే బస్సులను తమ కాలనీ మీదగా నడిపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కాలనీ వాసులు డిపో మేనేజర్‌తో కోరారు.

యూనిఫామ్స్ పంపిణీ

కొడంగల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని ఎంఈవో హరిలాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను యూనిఫామ్స్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కొడంగల్: అర్హులైన ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ విజయ్ కుమార్ అన్నారు. ఆయన గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఉదయించే సూర్యుడు అంబేడ్కర్

మర్పల్లి: ఉదయించే సూర్యుడు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అని మర్పల్లి అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు తక్కలి శివ అన్నారు. మండల కేంద్రంలో ఏప్రిల్ 1 నుంచి 14 వరకు నిత్యం పూలమాలలతో అలంకరించబడుతుందని తెలిపారు.